కందూరికి హాజరైన ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

కందూరి కార్యక్రమంకు హాజరైన ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కోవ అరుణ

రెబ్బెన, జూలై 21: మండలంలోని పుంజుమేరగూడ శ్రీ భువమ్మతల్లి దేవస్థానంలో మొహర్రం ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన కందూరి కార్యక్రమంకు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, సిర్పూర్(యు) మాజీ జడ్పీటీసీ కోవ అరుణలు హాజరైనట్లు దేవస్థానం అధ్యక్షుడు వినోద్‌జైస్వాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటి సభ్యులు, గ్రామ పెద్దలు ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య

చింతలమానేపల్లి, జూలై 21 : మండలంలోని బాలాజీ అనుకోడలోని పాల్వాయి నగర్‌లో ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్ఐ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం సుజయ్ విస్వాస్ (23) అనే యుడకుడు ఉరేసుని ఆత్మహత్య చేసుకున్నాడు. రవీంద్రనగర్ గ్రామానికి చెందిన సుజయ్ బిస్వాస్ మహారాష్ట్రలోని చంద్రాపూర్‌కు చెందిన నుపూర్ అనే యువతిని నాలుగు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. అప్పటి నుంచి భార్యతో కలిసి ఓ ఇంట్లో అద్దెకు నివాసం ఉంటున్నారు. మృతుడు ప్రైవేటు ఎల్క్ట్రీషన్ పనులు చేస్తుంటాడు. అతని భార్య ఇంటి వద్దనే ఉంటుంది. ఈ క్రమంలో శనివారం సాయంత్రం ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో క్షణికావేశంతో రాత్రి సమయంలో ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకున్నాడు. గమనించిన అతని భార్య నుపూర్ ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు దవాఖానకు తరలించారు. అప్పటికే ఆ యువకుడు మృతిచెందినట్లు డాక్టర్ నిర్ధారించారు. మృతుడి మామ కృష్ణాహీరా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ యాదవ్ తెలిపారు.

వాగులో దూకి ...

దహెగాం, జూలై 21 : మండలంలోని ఇట్యాల గ్రామానికి చెందిన కొట్రంగి సంతోష్(36) బొక్కివాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ కందూరి రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం శనివారం సాయంత్రం ఇంట్లో చిన్నపాటి గొడవ జరుగడంతో మనస్తాపానికి చెంది ఇంటి నుంచి వెళ్లిపోయి గ్రామసమీపంలోని బొక్కివాగులో దూకాడు. ఈవిషయాన్ని సమీపంలో ఉన్న బామిని గణపతి గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. ఆదివారం గ్రామస్తులు, పోలీస్‌లు వాగులో గాలింపు చర్యలు చేపట్టగా వాగులో శవమై దొరికాడు. కాగా మృతుని భార్య భూదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కార్మికుడి మృతి

జైపూర్, జులై 21: జైపూర్ పోలీస్‌స్టేషన్ పరిదిలోని ఇందారం ఫారెస్టు చెక్‌పోస్టు వద్ద శనివారం రాత్రి ద్విచక్రవాహనం అదుపుతప్పి క్రింద పడ్డ కార్మికుడు ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా అందుగులపేట గ్రామానికి చెందిన యాదగిరి రమేశ్ (35) ఇందారం ఓపెన్‌కాస్టు గనిలో సర్వే మజ్దూర్‌గా పని చేస్తున్నాడు. శనివారం రెండవ షిఫ్టు విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో ఇందారం ఫారెస్టు చెక్‌పోస్టు సమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి డివైడర్‌కు గుద్దుకున్నాడు. ఈ ప్రమాదంలో గాయపడగా రామక్రిష్ణాపూర్ సింగరేణి ఏరియా దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

అధికారుల బదిలీలు

తక్షణమే విధుల్లో చేరాలని ఉత్తర్వులు

మంచిర్యాలటౌన్, జూలై 21 : జిల్లాలోని మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పలువురు జూనియర్ అసిస్టెంట్లు, వార్డు ఆఫీసర్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మంచిర్యాల మున్సిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న విమలారాణి మందమర్రి మున్సిపాలిటీకి, షేక్ జహీర్ మందమర్రికి, రేగుంట కిష్టయ్య బెల్లంపల్లికి, పుల్లె రాజమణి నస్పూరుకు బదిలీ అయ్యారు. బెల్లంపల్లి మున్సిపాలిటీలో పని చేస్తున్న ఎన్ రాజ్‌కుమార్, ఎస్ పున్నంచందర్‌ను మందమర్రికి, ఎం సత్యనారాయణ మంచిర్యాలకు, మందమర్రిలో పని చేస్తున్న పెర్క ప్రవీణ్ మంచిర్యాలకు, ఎండీ జాఫర్ అహ్మద్ మంచిర్యాలకు, మహ్మద్ సోహెలుద్దీన్ క్యాతన్‌పల్లికి, అబ్దుల్ అజీం బెల్లంపల్లికి, ఆర్ లక్ష్మీకాంతరావు బెల్లంపల్లికి, డీ చంద్రశేఖర్ క్యాతన్‌పల్లికి, కమటం శ్రీనివాస్ మంచిర్యాలకు, ఆత్రం లక్ష్మీనారాయణ లక్షెట్టిపేటకు, సిర్ర శంకరవరప్రసాద్ మంచిర్యాలకు, నస్పూర్‌లో పనిచేస్తున్న బుర్ర లింగయ్య మందమర్రికి, రామగుండంలో పనిచేస్తున్న సెర్ల నాగరాజు మంచిర్యాలకు బదిలీ చేశారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో..

హాజీపూర్, జూలై 21 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జూనియర్ అస్టింటెంట్లు, కార్యాలయ సబార్డినేటర్‌ల బదిలీలు శనివారం జరిగాయి. నిర్మల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జూనియర్ అస్టిటెంట్‌గా విధులను నిర్వహిస్తున్న ఎకాంత్‌ను ఆదిలాబాద్‌కు, ఆదిలాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న ఏ శిల్పారాణిని బోథ్‌కు, మంచిర్యాలలో విధులు నిర్వహిస్తున్న బీ అశోక్ కుమార్‌ను ఆసిఫాబాద్‌కు, ఎన్ తేజస్వీని లక్షెట్టిపేటకు, నిర్మల్‌లో పని చేస్తున్న సాయి వివేక్‌ను ఆదిలాబాద్‌కు, మంచిర్యాలలో పని చేస్తున్న జీ సాయికుమార్‌ను ఆదిలాబాద్‌కు, భైంసాలో పని చేస్తున్న కే దినేశ్‌కుమార్‌ను మంచిర్యాలకు, భైంసాలో పని చేస్తున్న వై లక్ష్మిని ఆసిఫాబాద్‌కు, ఖానాపూర్‌లో పని చేస్తున్న దయాన్ రతన్‌ను భైంసాకు, ఆసిఫాబాద్‌లో పని చేస్తున్న ఏ మహేందర్‌ను ఆదిలాబాద్‌కు, లక్షెట్టిపేటలో పని చేస్తున్న అనిల్‌కుమార్‌ను ఆదిలాబాద్‌కు, ఆసిఫాబాద్‌లో పని చేస్తున్న జే నవీన్‌ను నిర్మల్‌కు, ఆదిలాబాద్‌లో పని చేస్తున్న కే కల్పనను బోథ్‌కు, ఆదిలాబాద్‌లో పని చేస్తున్న కే కపిల్‌కుమార్‌ను ఖానాపూర్‌కు, ఆదిలాబాద్‌లో పని చేస్తున్న రోహిత్‌ను మంచిర్యాలకు, ఆదిలాబాద్‌లో పని చేస్తున్న విజయ్‌కుమార్‌ను నిర్మల్‌కు, బోథ్‌లో పని చేస్తున్న మల్లికార్జున్‌ను నిర్మల్‌కు, బోథ్‌లో పని చేస్తున్న గంగామణి మంచిర్యాలకు బదిలీ అయ్యారు. మంచిర్యాల సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సబార్డినేటర్‌గా పని చేస్తున్న పీ చంద్రన్నను ఆదిలాబాద్‌కు, నిర్మల్‌లో పని చేస్తున్న టీ రాధను బోథ్‌కు, ఆదిలాబాద్‌లో పని చేస్తున్న కే సుమిత్రను ఖానాపూర్‌కు, మంచిర్యాలలో పని చేస్తున్న శ్రీనివాస్ రాజును ఆసిఫాబాద్‌కు, లక్షెట్టిపేటలో పని చేస్తున్న ఎన్ శారదను మంచిర్యాలకు, భైంసాలో పని చేస్తున్న సైరాభానును లక్షెట్టిపేటకు, ఖానాపూర్‌లో చేస్తున్న బీ కిషన్‌ను నిర్మల్‌కు, ఆదిలాబాద్‌లో పని చేస్తున్న ఏ దీనమ్మను నిర్మల్‌కు, ఆదిలాబాద్‌లో పని చేస్తున్న ఎండీ గౌస్‌ను మంచిర్యాలకు, బోథ్‌లో పనిచేస్తున్న ఎం విజయలక్ష్మిని భైంసాకు బదిలీ చేస్తూ జిల్లా రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు.

జడ్పీ కార్యాలయాల్లో..

హాజీపూర్, జూలై 21 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని జడ్పీ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సూపరింటెండెంట్లు, సీనియర్ అస్టింటెంట్లను బదిలీ చేస్తూ శనివారం రాత్రి పంచాయతీ రాజ్, గ్రామీణ ఎంప్లాయ్‌మెంట్ కమిషనర్ హన్మంత రావ్ (ఐఏఎస్) ఉత్తర్వులు జారీ చేశారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ ఎంపీపీ కార్యాలయంలో పని చేస్తున్న డీ తోటాజీ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయానికి, బెజ్జూర్‌లో పని చేస్తున్న ఆకుల శ్రీనివాస్‌ను జైనూర్‌కు, జైనూర్ కార్యాలయంలో పని చేస్తున్న రాంచందర్‌ను లింగాపూర్‌కు, కౌటాల నుంచి అబ్దుల్ నసూరూల్లా ఖాన్‌ను పెంచికల్‌పేట్‌కు, మంచిర్యాల జిల్లా కాసిపేట ఎంపీపీ కార్యాలయంలో పని చేస్తున్న వినయ్‌కుమార్‌ను మంచిర్యాల జడ్పీకి, మందమర్రి నుంచి బాలకృష్ణను హాజీపూర్‌కు, దండేపల్లి నుంచి జాడి శ్రీనివాస్‌ను మంచిర్యాల జడ్పీకి, లక్షెట్టిపేట నుంచి సత్యనారాయణను దండేపల్లికి, మంచిర్యాల జడ్పీ కార్యాలయంలో పని చేస్తున్న ఏ వేణుగోపాల్‌రావును మందమర్రికి, జైపూర్ నుంచి కనపర్తి సంజీవ స్వామిని లక్షెట్టిపేటకు, కోటపల్లికి చెందిన అల్లూరి లక్ష్మయ్యను కాసిపేటకు, తాండూర్‌కు చెందిన వేణుగోపాల్‌ను బెల్లంపల్లికి, హాజీపూర్‌కు చెందిన గుండ భాగ్యలక్ష్మిని జైపూర్ ఎంపీపీ కార్యాలయానికి బదిలీ చేశారు.

సీనియర్ అసిస్టెంట్లు

ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి కార్యాలయంలో పని చేస్తున్న డీ మహేశ్‌ను ఆసిఫాబాద్ జడ్పీకి, మంచిర్యాల జిల్లా చెన్నూర్ కార్యాలయంలో పని చేస్తున్న ఎస్ మధులతను జైపూర్‌కు, మంచిర్యాల జడ్పీ కార్యాలయంలో పని చేస్తున్న ఎన్ గౌతమ్‌ను మందమర్రికి, కాసిపేటకు చెందిన రవిబాబును మంచిర్యాలకు, జన్నారంలో పని చేస్తున్న వెంకటేశ్వర్‌రావును మంచిర్యాల జడ్పీకి, బెల్లంపల్లికి చెందిన కొండయ్యను హాజీపూర్‌కు, జైపూర్ నుంచి మల్లికార్జున్‌ను చెన్నూర్‌కు, వేమనపల్లి నుంచి లక్ష్మీనారాయణను కాసిపేటకు, మంచిర్యాల జడ్పీ నుంచి మనోహర్‌బాబును జన్నారంకు, మందమర్రి నుంచి రవీందర్‌ను భీమిని ఎంపీపీ కార్యాలయానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులను జారీ చేశారు.

సింగరేణిని దోచుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం

శ్రీరాంపూర్, జూలై 21: సింగరేణి సంస్థను ఆర్థికంగా కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకుంటుందని గుర్తింపు కార్మిక సంఘం(ఎఐటీయూసీ) రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఆదివారం కే వీరభద్రయ్య ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రభుత్వాలు మారినా సింగరేణి ఆర్థిక దోపిడి మారడం లేదన్నారు. రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పేరుతో సింగరేణి సొమ్మును దోచి పెట్టడానికి ఈ పథకం తీసుకవచ్చారని ఆరోపించారు. ఉన్నతాధికారులు సింగరేణికి వచ్చిన లాభాల నుంచి కార్మికుల సంక్షేమం కోసం వారి మౌలిక సదుపాయాల కోసం సింగరేణి ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి కోసం ఖర్చు చేయాలి కానీ ఇలా వృథా చేయడం మానుకోవాలన్నారు. సంస్థకు రావాల్సిన 29 వేల కోట్ల రూపాయల బకాయిలను తీసుకవచ్చే విధంగా ప్రయత్నాలు చేయాలని డిమాండ్ చేశారు. సంస్థ లాభాలను వెంటనే ప్రకటించి కార్మికులకు 35 శాతం వాటా చెల్లించాలని కోరారు.

సంత్ తపస్వి రామారావు మహారాజ్ జయంతి

కాసిపేట, జూలై 21 : కాసిపేట మండలంలోని సోమగూడెం(కే) తండాలో ఆదివారం మంచిరాల జిల్లా గిరిజన జేఏసీ సపాట్ శంకర్ ఆధ్వర్యంలో గురు పౌర్ణమి సందర్భంగా శ్రీ శ్రీ శ్రీ సంత్ తపస్వి రామారావు మహారాజ్ 89వ జయంతి కార్యక్రమాన్ని సేవాలాల్ మహారాజ్ మందిరంలో భోగుబండార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంధర్భంగా సోమగూడెం(కే) క్రీడా మైదానంలో ఐదు యాప మొక్కలు, ఒక జంబి మొక్కను నాటారు. సపాట్ శంకర్ మాట్లాడుతూ గురు సంత్ రామారావు మహారాజ్ భారత దేశంలో అన్ని తండాలలో పర్యటించి సన్మార్గాని హితబోధించి విద్య జ్ఞానం పరివర్తన మనిషిలో మానవ మానవత్వ విషయాలపై బంజారాలను ఏకతాటిపై తీసకువచ్చారంటే ఆ గురువుగారి కృపేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తండా నాయకులు అజ్మీర శ్రీనివాస్ నాయక్, సభావత్ చందు నాయక్, సభావత్ రాయ మల్లు నాయక్, భూక్య మొగిలి నాయక్, అశోక్, సక్రియ నాయక్, అజ్మీర తారు, మహిళలు ముత్తు భాయ్, భాగ్య భాయ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ మృతి

సిర్పూర్(యు) జూలై 21 : మండలంలోని పంగిడి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ గెడం మారుతి కొన్ని రోజులుగా అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందినట్లు కుటంబ సభ్యులు ఆదివారం తెలిపారు. ఆయన మృతి పట్ల కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు పలువురు సంతాపం తెలిపారు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

మందమర్రి, జులై 21: పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరమవుతాయని మందమర్రి మున్సిపల్ కమిషనర్ నిలిగొండ వెంకటేశ్వర్లు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులో ఆదివారం నిర్వహించిన పది గంటల పది నిమిషాల కార్యక్రమంలో పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. వార్డులోని పాత పోలీస్ స్టేషన్, పాత ఫిల్టర్‌బెడ్ కాలనీలలో సిబ్బందితో కలసి ఇంటింటికి వెళ్లి ఇండ్లలో ఉన్న పాత వస్తువులలో నిలువ అయిన వర్షపు నీటిని తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండ్ల పరిసరాలలో కూలర్లు, పగిలి పోయిన కుండలు, పాతటైర్లలో వర్షపు నీరు నిలువ ఉండటం వలన దోమలు వృద్ధిచెంది డెంగ్యూ, చికన్‌గున్యా లాంటి వ్యాధులు ప్రబలుతాయని అన్నారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ శ్యాంసుందర్, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

ముగిసిన సింగరేణి ఉద్యోగ నియామక పరీక్షలు

సింగరేణి మైనింగ్ ఉద్యోగ నియామక పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న సీఎండీ శ్రీధర్

పరీక్ష రాసిన 12,045 మంది
64.57 శాతం హాజరు

శ్రీరాంపూర్, జూలై 21: సింగరేణి సంస్థలో 272 ఖాలీల భర్తీకి ఈనెల 20, 21 రెండు రోజుల పాటు 12సెంటర్లలో నిర్వహించిన కంప్యూటర్ ఆధారిత పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. సీఎండీ ఎన్ భలరామ్ తొలిసారిగా హైదరాబాద్ కేంద్రంగా ఈ పరీక్షలను నిర్వహించారు. 20న మూడు షిఫ్టులలో జూనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్, మేనేజ్మెంట్ ట్రైనీ (ఎఫ్‌అండ్‌ఏ), జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్, మేనేజ్మెంట్ ట్రైనీ హైడ్రోజియాలజిస్ట్, మేనేజ్మెంట్ ట్రైయినీ సివిల్, జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్ మేనేజ్మెంట్ ట్రైనీ (ఐఈ)సబ్ ఓవర్‌సీర్ ట్రైనీసివిల్ పోస్టులకు పరీక్ష నిర్వహించగా మొత్తం 1,172 అభ్యర్థులకు7,073 అభ్యర్థులు (60.53) శాతం పరీక్షలు రాశారు. మొత్త 6931 అభ్యర్థులకు (71.773) శాతం అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. మొత్తం 18,665 మందికి హాల్ టికెట్ జారీ చేయగా 12,045 మంది పరీక్షలకు హాజరయ్యారు. దాదాపు 65 శాతం మంది హాజరయ్యారు.

కుంగిన సర్వీస్ రహదారి

ఆందోళనలో ప్రజలు

కుంగిన రహదారిని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు

మందమర్రి, జూలై 21 : మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని పాతబస్టాండ్ చౌరస్తాలో సర్వీస్ రహదారి ఆదివారం స్వల్పంగా కుంగిపోవడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. బురదగూడెం వైపు నుంచి మార్కెట్ వెళ్లే మూల మలుపు వద్ద నిర్మించిన జాతీయ రహదారి ఫ్లైఓవర్ వంతెన ఫిల్లర్ సమీపంలో గల సర్వీస్ రహదారి కొంతమేర కుంగిపోవడాన్ని గమనించిన స్థానికులు, వాహణ చోదకులు ఆదివారం నేషనల్ హైవే ఆథారిటీ, మున్సిపల్ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న హైవే అథారిటీ అధికారులు, సిబ్బంది కుంగిన రహదారి పై నుంచి వాహనాలు వెళ్లకుండా ఏర్పాట్లు చేశారు. మందమర్రి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు సిబ్బందితో కలసి రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన రహ దారి కావడం, ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండటం వలన కొంతమేర మట్టి కుంగిపోయి రహదారి పై గోతి ఏర్పడిందన్నారు. దీని మూలంగా ప్రమాద మేమి లేదని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు.

ఆటుపోట్లకు ఆస్కారం

మార్కెట్ పల్స్

దేశీయ స్టాక్ మార్కెట్లలో గత వారం సైతం నూతన రికార్డులు నమోదయ్యాయి. అయితే వరుస లాభాలతో సూచీలు గరిష్ఠ స్థాయిల్లో కదలాడుతున్న వేళ.. మదుపరులు లాభాల స్వీకరణ దిశగా అడుగులు వేశారు. దీంతో ఓవరాల్‌గా స్వల్ప లాభాలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 85.31 పాయింట్లు పెరిగి 80,604.65 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 28.75 పాయింట్లు అందుకుని 24,530.90 దగ్గర ముగిసింది. శుక్రవారం భారీ నష్టాలు వాటిల్లకపోతే సూచీలు నయా ఆల్‌టైమ్ హైల్లోనే ఉండేవి. ఇక ఈ వారం కూడా మదుపరులు ఆయా సంస్థల త్రైమాసిక ఆర్థిక ఫలితాల ఆధారంగా తమ పెట్టుబడులపై నిర్ణయం తీసుకునే వీలున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్) కోసం కంపెనీలు తమ ఫైనాన్షియల్ రిజల్ట్స్‌ను ప్రకటిస్తున్న విషయం తెలిసిందే. అయినప్పటికీ సూచీలు రికార్డుస్థాయి గరిష్ఠాల్లో ఉన్నందున పెట్టుబడులు-ఉపసంహరణల మధ్య ఇన్వెస్టర్లు కొట్టుమిట్టాడేందుకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కాగా, గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఎప్పట్లాగే ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,200 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 23,900 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 24,700-24,900 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

ఆఖర్లో కాదు..

రుణ చెల్లింపుల్లో లాభం ఇలా

మనలో ప్రతి ఒక్కరూ ఎప్పుడో ఒకప్పుడు బ్యాంకుల్లో లేదా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల్లో రుణాన్ని తీసుకోవడం సహజం. అయితే ఆ రుణ భారాన్ని వీలైనంత త్వరగా తీర్చేసుకుందామనుకొని కొన్ని పొరపాట్లు చేస్తుంటారు. దీనివల్ల నష్టాల పాలవుతూంటారు. అందుకే రుణ చెల్లింపుల విషయంలో ఎప్పుడు? ఎలా? అన్నది అత్యంత ముఖ్యమైన అంశం. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల్లో లోన్లు తీసుకున్నప్పుడు.. వడ్డీతో కలిపి ఆ మొత్తాన్ని నిర్ణీత లేదా రుణగ్రహీత ఎంచుకున్న కాలవ్యవధికి సమాన ఈఎంఐలుగా పంచుతారు. అయితే ఈ నెలవారీ వాయిదాల్లో మొదట చెల్లిస్తూపోయే వాటిలో ఎక్కువ మొత్తం రుణంపై రుణదాతలు వసూలు చేసే వడ్డీనే ఉంటుంది. కాలం గడుస్తున్న కొద్దీ చివర్లో ఉండే ఈఎంఐల్లో వడ్డీకన్నా అసలే ఉంటుంది. అంటే.. రుణం తీసుకున్న తొలినాళ్లలో చెల్లించే ఈఎంఐల్లో ఎక్కువ మొత్తం వడ్డీ కిందనే పోతుంది. అసలు రుణంలో మైనస్ అయ్యేది చాలా తక్కువ. అలాగే ఆఖర్లో చెల్లించే ఈఎంఐల్లో వడ్డీకన్నా అసలు రుణమే ఎక్కువగా ఉంటుంది. కాబట్టి రుణ భారం తగ్గించుకోవాలనుకునే వారు మొదట్లోనే వీలైనంత చెల్లించడం మంచిది. ఆఖర్లో ఒకేసారి చెల్లించడం కన్నా ఈఎంఐలను అనుసరించడమే లాభదాయకం.

లోన్ పోర్టబులిటీ

రుణాలపై వివిధ బ్యాంకులు, సంస్థలు రకరకాల వడ్డీరేట్లను అనుసరిస్తాంటాయి. రుణగ్రహీత సిబిల్ స్కోర్‌తోపాటు మరికొన్ని అంశాలు ఇందులో ప్రధాన పాత్ర పోషిస్తాయి. అయితే మనం తీసుకున్న రుణంపై వడ్డీరేటు ఎక్కువగా ఉందనుకుంటే.. ఎందులో తక్కువగా ఉందో తెలుసుకుని ఆ మొత్తం రుణాన్ని అక్కడికి మార్చుకోవడం ఉత్తమం. దీన్నే లోన్ పోర్టబులిటీ అంటారు. దీనివల్ల వడ్డీ భారం తగ్గుతుంది. కానీ ఈ ప్రక్రియకు కొన్ని చార్జీలు వర్తిస్తాయి. వీటన్నిటినీ కలిపి లెక్కించే రుణాన్ని ఒక సంస్థ నుంచి మరో సంస్థకు మార్చుకోవడం లాభమా? నష్టమా? అన్నది తేల్చుకోవాలి. లేకపోతే భారం మరింత పెరిగే ప్రమాదం ఉన్నది.

ఐటీఆర్‌లో సెక్షన్‌తో కొడదాం

ఇది ఆదాయ పన్ను రిటర్న్ (ఐటీఆర్)ల కాలం. 2023-24 ఆర్థిక సంవత్సరానికి (2024-25 మదింపు సంవత్సరం) గాను ఈ నెలాఖర్లోగా (జూలై 31) ఐటీఆర్‌ను దాఖలు చేయాల్సి ఉంటుంది. దీంతో పన్ను ఆదా కోసం ఉన్న మార్గాలను అంతా వెతుకుతున్నారు. అయితే అందరికీ తెలిసింది సెక్షన్ 80సీ మాత్రమే. కానీ ఐటీ చట్టంలోని వివిధ సెక్షన్ల కింద రకరకాల పెట్టుబడులు, ఖర్చులు, రుణాల చెల్లింపులు, వడ్డీ ఆదాయాలపై పన్ను మినహాయింపును పొందవచ్చు. వాటిని పరిశీలిస్తే..

1. నేషనల్ పెన్షన్ సిస్టమ్

నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)లో పెట్టుబడులకు సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షలదాకా పన్నును ఆదా చేసుకోవచ్చు. ఇక సెక్షన్ 80సీసీడీ (1బీ) కింద అదనంగా మరో రూ.50,000 ఆదా చేయవచ్చు. మొత్తంగా రూ.2 లక్షలు ఆదా అవుతాయి.

2. ఆరోగ్య బీమా

సెక్షన్ 80డీ కింద ఆరోగ్య బీమా ప్రీమియంను క్లెయిం చేసుకోవచ్చు. ఎంత? అన్నది పాలసీ కవరేజీ, వయసుపై ఆధారపడి ఉంటుంది. ఇలా రూ.25,000, రూ.50,000, లక్ష రూపాయల వరకు పన్ను ఆదా చేసుకోవచ్చు.

3. విద్యా రుణం

పిల్లల విద్య కోసం రుణం తీసుకున్నట్టయితే.. దాని చెల్లింపులపైనా పన్ను మినహాయింపును క్లెయిం చేసుకోవచ్చు. సెక్షన్ 80ఈ కింద విద్యా రుణంలోని వడ్డీ భాగంపై పన్ను మినహాయింపును పరిమితి అనేదే లేకుండా పొందవచ్చు. రుణాన్ని చెల్లించేది తల్లిదండ్రులా.. పిల్లలా.. అన్న తేడా లేకుండా ఈ ప్రయోజనాన్ని అందుకోవచ్చు.

4. హోమ్ లోన్ వడ్డీ

గృహ రుణ చెల్లింపులపై రెండు మార్గాల్లో పన్ను మినహాయింపును క్లెయిం చేసుకోవచ్చు. ఒకటి సెక్షన్ 80సీ కింద అసలుపై రూ.1.5 లక్షల వరకు పన్ను ఆదా చేసుకోవచ్చు. మరొకటి సెక్షన్ 24 కింద వడ్డీ భాగంపై రూ.2 లక్షలదాకా పన్ను ఆదా కోరవచ్చు. కొన్న ఇంట్లో మీరున్నా.. లేదా దానిపై అద్దె ఆదాయం పొందుతున్నా.. పన్ను మినహాయింపులను అందుకోవచ్చు.

5. తొలిసారి ఇంటి కొనుగోలుపై

తొలిసారి ఇంటిని కొనుగోలుచేసేవారికి సెక్షన్ 80ఈఈ కింద గృహ రుణ వడ్డీపై కేంద్ర ప్రభుత్వం అదనపు పన్ను ప్రయోజనాలను కల్పిస్తున్నది. ఈ సెక్షన్‌లో రూ.50,000 వరకు ఎక్స్‌ట్రా ట్యాక్స్ క్లెయిములు చేయవచ్చు. సెక్షన్ 24 కింద వర్తించే మినహాయింపులకు అదనం. దీంతో రూ.2.5 లక్షల వరకు ప్రయోజనం ఉంటుంది. అయితే మీ పేరిట అంతకుముందు ఏ ఇల్లూ ఉండరాదు. అలాగే కొనే ఇంటి విలువ రూ.50 లక్షలు మించరాదు. తీసుకునే అప్పు కూడా రూ.35 లక్షలు దాటరాదు.

6. హెచ్ఆర్ఏ

ఉద్యోగులకు వారి సంస్థ యాజమాన్యాలు హౌజ్ రెంట్ అలవెన్స్ (హెచ్ఆర్ఏ)ను ఇస్తే.. అద్దెపై పన్ను మినహాయింపును పొందవచ్చు. సెక్షన్ 80జీజీ కింద ఈ అవకాశం ఉంటుంది.

7. ఎస్‌బీ అకౌంట్ వడ్డీ

సేవింగ్స్ బ్యాంక్ (ఎస్‌బీ) అకౌంట్ నుంచి అందుకునే వడ్డీ ఆదాయంపైనా పన్ను మినహాయింపును కోరవచ్చు. వ